# గౌరవంగా ఆఖరి మజిలీ

మునుగోడు మండలంలో పూర్తయిన వైకుంఠధామాలు
పచ్చని చెట్లు.. పూల మొక్కల మధ్య ఏర్పాటు
పల్లె ప్రగతితో గ్రామాల్లో సమకూరుతున్న మౌలిక వసతులు
అక్కడే స్నానాలకు ఏర్పాట్లు

మునుగోడు,అక్టోబర్ 20 : మనిషి బతికున్నప్పుడే కాదు.. చనిపోయాక కూడా గౌరవంగా అంతిమ సంస్కారాలు నిర్వహించాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె, పట్టణాల్లో వైకుంఠధామాలకు శ్రీకారం చుట్టింది. గతంలో గ్రామంలో ఎవరైనా చనిపోతే వారిని ఖననం చేయడానికి స్థలం లేక అనేక ఇబ్బందులు పడేవారు. రోడ్డు పక్కన, చెర్వు ఒడ్డున దహనం చేసేవారు. కానీ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ సమస్య తీరిపోయింది. అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించింది. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పూర్తి కాగా మరికొన్ని గ్రామాల్లో ప్రగతిలో ఉన్నాయి.



మునుగోడు లోని వైకుంఠధామం ముఖద్వారం

**ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పంతోనే..**

ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం మేరకు మునుగోడు మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో వైకుంఠధామాల నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఈజీఎస్ నిధుల ద్వారా ఒక్కో వైకుంఠధామానికి రూ.14 లక్షలు మంజూరు చేసింది. కాగా పలివెల గ్రామపంచాయతీలో నిర్మించిన వైకుంఠధామానికి మాత్రమే రూ.9 లక్షలు మంజూరయ్యాయి. పీఆర్ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపట్టారు. కాగా ఈ వైకుంఠధామాలను అధునాతన సౌకర్యాలను కల్పిస్తున్నారు.

**వైకుంఠధామాల్లో కల్పిస్తున్న వసతులు**

వైకుంఠధామాల్లో కల్పిస్తున్న వసతులు ప్రహరీ నిర్మాణం, చితి కోసం ప్లాట్‌ఫాం నిర్మాణం, అస్తికలను భద్రపరిచే సౌకర్యం, వెయింటింగ్ ఏరియా, వాష్ ఏరియా, హరితహారం పనులు చేపడుతున్నారు. దాంతో ఆయా గ్రామాలు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


వైకుంఠధామంలో నిర్మించిన స్నానాల గది

**గతంలో చాలా ఇబ్బందులు పడ్డాం**



గతంలో గ్రామంలో ఎవరైన చనిపోతే వారిని ఖననం చేయడానికి స్థలం లేక అనేక ఇబ్బందులు పడేవాళ్లం. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతిలో అన్ని వర్గాల వారికి ఉపయోగపడేలా వైకుంఠధామాలు నిర్మించింది. అంతేకాకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం ఆనందంగా ఉంది.

–వంగూరి పద్మాలింగయ్య, సర్పంచ్, కొరటికల్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

# బీఆర్ఎస్‌తోనే మునుగోడు అభివృద్ధి

ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
చౌటుప్పల్‌లో ముఖ్య కార్యకర్తలతో సమావేశం

చౌటుప్పల్, అక్టోబర్ 20 : బీఆర్ఎస్‌తోనే మునుగోడు అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని జయశ్రీ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ మండల ముఖ్యకార్యకర్తల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే ఈ అభివృద్ధి సాధ్యమైనదన్నారు. ఇందు కోసం ప్రస్తుత ఎన్నికల మ్యానిఫెస్టోను కూడా ప్రజల్లోకి కార్యకర్తలు తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సైతం వివరించాలన్నారు. అంతేకాకుండా ఇటీవల ఇక్కడ జరిగిన ప్రతి అభివృద్ధిని కూడా గుర్తు చేయాలన్నారు. బీఆర్ఎస్‌ను అడ్డుకునే శక్తి కాంగ్రెస్, బీజేపీ లేదన్నారు. కాంగ్రెస్ గ్యారెంటి హామీలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మాట తప్పని వ్యక్తి అని ప్రజలకు తెలుసన్నారు. అదే బీఆర్ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తేస్తుందన్నారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్, బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, కొత్త పర్వతాలు యాదవ్, డిల్లీ మాధవరెడ్డి పాల్గొన్నారు.

**అన్నదానం ప్రారంభం**

దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా చౌటుప్పల్ పట్టణంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బత్తుల శ్రీశైలం, దాచేపల్లి ప్రకాశ్, దాచేపల్లి శ్రీనివాస్, మంచికంటి భాస్కర్, కామిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో బీసీలకు స్థానం లేదు

- ఆ పార్టీని కోమటి రెడ్డి లాంటి వాళ్లు కబ్జా చేసిండ్రు
- విలేకరుల సమావేశంలో చెరుకు సుధాకర్ గౌడ్
- కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన

నల్లగొండ, అక్టోబర్ 20 : ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు టికెట్లు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం చెబుతుంటే.. వారి మాటలను ఆ పార్టీ రాష్ట్ర నేతలు పట్టించుకోకుండా టికెట్లు కేటాయిస్తున్నారని, అసలు ఆ పార్టీలో బీసీలకు స్థానమే లేదని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్ గౌడ్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని ఎస్‌బీఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రవర్ణాలకు అడ్డాగా మారిందని.. కోమటిరెడ్డి, రేవంత్‌రెడ్డి లాంటి వాళ్లు ఆ పార్టీని కబ్జా చేశారని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు స్థానం లేదని ఆరోపించారు. కోమటిరెడ్డి తిట్ల దండకం, ఇతరులను రెచ్చగొట్టడం వంటివి చేపడుతూ పీసీసీ చీఫ్‌ను సైతం వణికిస్తున్నట్లు తెలిపారు. బీసీలకు ప్రాధాన్యత ఇస్తామంటున్న కాంగ్రెస్.. బీసీ ఓట్లు లేని, అభ్యర్థుల బలం లేని ప్రాంతాల్లో 12 సీట్లు ఇచ్చి ఉదయపూర్ డిక్లరేషన్ పాటిస్తున్నామని చెప్పుకొంటే ఎలా అని ప్రశ్నించారు.

**సీఎం కేసీఆర్ నన్ను సుధాకరన్నా అని గౌరవించారు..**

సీఎం కేసీఆర్ లాంటి గొప్ప వ్యక్తులే తనను సుధాకరన్నా అని గౌరవించారని, తెలంగాణ బిడ్డలకు అధికారం కన్న ఆత్మ గౌరవమే ప్రధానమని, కాంగ్రెస్‌లో కనీస గౌరవం లేక పార్టీ నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. నల్లగొండ నిరుద్యోగ సభలో నలుగురు అగ్రవర్ణాల వారు చేతులు కలిపి ఇది మా బలగం అంటే జనం నమ్మబోరని, ఆ సభలో బీసీ నాయకుడిని, ఉద్యమకారుడిని స్టేజీ ఎక్కకుండా అవమానించి మా బలగం అనడం సిగ్గుగా ఉన్నదన్నారు. మీ ప్రదర్శన బలగం కాదని, బడుగు బలహీన వర్గాలను పీల్చి పిప్పి చేసే జలగల ప్రదర్శన అని విమర్శించారు. నల్లగొండలో బీసీలకు టికెట్ ఇస్తానని మాట్లాడితే సరిపోదు.. దమ్ముంటే ఇచ్చి చూపించాలని సవాల్ చేశారు. బొడ్డుపల్లి లక్ష్మికి టికెట్ ఇచ్చి మాట నిలబెట్టుకుంటే.. తాను కాంగ్రెస్‌లో ఉండి ఆమె గెలుపు కోసం పని చేస్తానని ప్రకటించారు. తన కొడుకుకు ఫోన్ చేసి బెదిరించడం కాదు.. బిడ్డా కోమటిరెడ్డీ.. నల్లగొండలో ఎట్లా గెలుస్తావో చూస్తానని సవాల్ చేశారు. 'నీకు తెల్వకుండా నేను కాంగ్రెస్‌లో చేరితే తప్పు. నాకు తెల్వకుండా నువ్వు వీరేశాన్ని చేర్చుకొని నకిరేకల్‌లో ఎలా ఊరేగుతున్నావ్' అని ప్రశ్నించారు. ఆయన నకిరేకల్‌లో ఎలా గెలుస్తాడో చూస్తానని అన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చెరుకు సుధాకర్ గౌడ్

మునుగోడు ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయమని చెప్పి అక్కడ స్రవంతికి డిపాజిట్ కూడా రాదని నువ్వు శపథం చేస్తే.. తాము తిరిగి 23వేల ఓట్లు సాధించినది కాంగ్రెస్ పెద్దలకు తెల్వదా? అని ప్రశ్నించారు. కోమటిరెడ్డి భయానికి తనతో పాటు నందికంటి శ్రీధర్ లాంటి వారికి కాంగ్రెస్ అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు ఎన్నో ఏండ్లు సేవలు చేసిన పొన్నాల లక్ష్మయ్యను వెళ్లగొట్టడానికి అక్కడ ఇద్దరు అగ్రవర్ణాల వారిని రెచ్చగొట్టి కోమటిరెడ్డి అన్యాయం చేశాడన్నారు.

నల్లగొండలో నయాం బాధితులు ఎంత మంది ఉన్నారో.. కాంగ్రెస్‌లో కూడా కోమటిరెడ్డి బాధితులు అంతే మంది ఉన్నారని, ఇకనైనా అధిష్టానం గుర్తించకపోతే ఆ పార్టీలో కింది స్థాయి వర్గాలకు న్యాయం దక్కదని అన్నారు. తాను 2003లోనే కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరి ఒక వ్యక్తి అధిష్టానానికి ఇచ్చిన తప్పుడు సమాచారం వల్ల ఆయన టికెట్ తెచ్చుకొని ఎమ్మెల్యే అయ్యాడని, అలాంటి వ్యక్తి విషపు కోరలు ఆ పార్టీ అధిష్టానానికి తెలిసి బయటకు పంపడం సంతోషకరమన్నారు. అలాంటి వ్యక్తులకు మళ్లీ గుణపాఠం చెప్పాల్సి ఉన్నదని వేముల వీరేశాన్ని ఉద్దేశించి చెప్పారు. బీఆర్ఎస్‌లో ఉద్యమకారులకు మరోసారి సముచిత స్థానం ఇచ్చే విధంగా అధిష్టానం ఆలోచన చేయడం సంతోషమన్నారు. తాను కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నానని, త్వరలో ఏ పార్టీలో చేరేది ప్రకటిస్తానని చెప్పారు. సమావేశంలో చెరుకు లక్ష్మి, షేక్ చాంద్, చంద్రకాంత్‌రెడ్డి, సందీప్ చౌక, రాందాస్, అనంతుల మధు, సైదులు పాల్గొన్నారు.

**సీఎం కేసీఆర్ సభకు స్థల పరిశీలన**


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ అపూర్వరావు

మునుగోడు, అక్టోబర్ 20 : ఈ నెల 26న సీఎం కేసీఆర్ మునుగోడులో నిర్వహించే బహిరంగ సభ స్థలాన్ని నల్లగొండ ఎస్పీ కె.అపూర్వరావు శుక్రవారం పరిశీలించారు. సభ ప్రాం గణం వేదిక, హెలిప్యాడ్, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ స్థలాలు, స్థానిక పోలీసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు హెలిప్యాడ్ కోసం కావలసిన వసతులను జాగ్రత్తగా పరిశీలించారు. వాహనాల సభా ప్రాంగణం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక అధికారులకు సూచించారు. ఆమె వెంట నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ సోమ్‌నారాయణసింగ్, చండూరు సీఐ వెంకటయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**హైవేపై వాహనాల బారులు**

చౌటుప్పల్,అక్టోబర్ 20 : దసర పండుగ, సద్దుల బతుకమ్మ నేపథ్యంలో చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. పండుగ సమీపిస్తుండడంతో వాహనదారులు హైదరాబాద్ నుంచి సొంతూర్లకు ముందుస్తుగా బయల్దేరారు. దాంతో వాహనాల తాకిడి పెరిగింది. పట్టణ కేంద్రంలోని స్థానిక బస్టాండ్, తంగడపల్లి, వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది.


చౌటుప్పల్‌లో బారులు తీరిన వాహనాలు

**ఆర్థిక సాయం**

నాంపల్లి, అక్టోబర్ 20 : మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన రైతు బంధు సమితి అధ్యక్షుడు పోలగోని యాదయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వట్టికోటి సుధాకర్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జట్టగోని శ్రీశైలం ఉన్నారు.

**కుమ్మరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భిక్షం**


చిలుకూరి భిక్షం

నాంపల్లి, అక్టోబర్ 20 : మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన చిలుకూరి భిక్షం కుమ్మరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో తనను నియమించినట్లు భిక్షం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన కుమ్మరి సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొండూరు చంద్రయ్య, రాష్ట్ర అధ్యక్షుడు నీలికొండ లక్ష్మణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి**


దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ మహేందర్‌రెడ్డి

రామన్నపేట, అక్టోబర్ 20 :పారిశుధ్యకార్మికుల సేవలు వెలకట్టలేనివని సర్పంచ్ ఎద్ల మహేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో ఇడెం స్వరూప సేవా సంస్థ ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుధ్యకార్మికులకు ఒక్కొక్కరికి రెండు జతల చెప్పున వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలోఇడెం స్వరూప స్మారక సేవా సంస్థ చైర్మన్ ఇడెం రాధ–శ్రీనివాస్, వార్డు సభ్యులు నకిరేకంటి ఎల్లయ్య, తలారి నర్సింహ, పిట్ట మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.